క్లుప్తంగా

వంద పడకల ఆస్పత్రి ఏర్పాటుకు ఉద్యమం

కల్వకుర్తి రూరల్: నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి లేకుండా పోయిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నర్సింహ విమర్శించారు. నియోజకవర్గ కేంద్రమైన కల్వకుర్తి పట్టణంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం ఉద్యమిస్తామన్నారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణ కేంద్రం నుంచి 2 జాతీయ రహదారులు వెళ్తున్నాయన్నారు. ప్రతి నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది గాయపడటంతో పాటు చనిపోతున్నారన్నారు. ఇప్పటికైనా వంద పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలన్నారు. దుర్గాప్రసాద్, రవిగౌడ్, పర్వతాలు, బాబీదేవ్, పరశురాములు, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరుతడి పంటలే లాభదాయకం



లింగాల: తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి ఇచ్చే ఆరుతడి పంటల సాగు ఎంతో లాభదాయకమని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అవుసలికుంట శివారులో రైతులు సాగు చేసిన అపరాలు(మినుము) పంటను ఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. ప్రస్తుతం అపరాల పంట కోత దశలో ఉందన్నారు. ఇలాంటి పంటలకు పెట్టుబడి తక్కువ అవుతుందని, నీటి వాడకం కూడా తక్కువేనని అన్నారు.

ఆస్పత్రిలోనే కాన్పులు నిర్వహించుకోవాలి

తాడూరు: తల్లీబిడ్డలు సురక్షితంగా ఉండాలంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు నిర్వహించుకోవాలని వైద్యాధికారి డాక్టర్ సంతోష్ అభిరాం అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పు నిర్వహించుకున్న యత్మతాపూర్‌కు చెందిన శివలీలకు కేసీఆర్ కిట్టు అందజేసి మాట్లాడారు. ఆశావర్కర్లంతా గ్రామాల వారీగా గర్భిణుల జాబితాను తయారు చేసి, వారంతా ప్రతి నెలా ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు నిర్వహించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్ఎం లక్ష్మీకుమారీ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కొండూరు పాఠశాలకు అత్యధిక సీట్లు

పెంట్లవెల్లి: కొండూరు పాఠశాల విద్యార్థులు గురుకుల ఫలితాల్లో జిల్లాలోనే అత్యధిక సీట్లు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ తెలియజేశారు. ప్రస్తుతం 20 సీట్లు సాధించారని, మూడేళ్ల నుంచి ఇప్పటి వరకు 140 సీట్లు సాధించారని వివరించారు.

శివకుమార్‌కు యూట్యూబ్ అవార్డు



కల్వకుర్తి రూరల్: పట్టణానికి చెందిన వ్యవసాయ విద్యార్థి శివకుమార్‌కు యూట్యూబ్ అవార్డు లభించింది. వ్యవసాయానికి సంబంధించిన విషయాలతో పాటు రైతులకు వివిధ రాష్ట్రాల్లో సాగవుతున్న పద్ధతులపై యూట్యూబ్ ద్వారా అవగాహన కల్పించడంతో పాటు సొంతంగా వీడియోలు చేసి చైతన్యం చేస్తున్నారు. మంగళవారం శివకుమార్‌కు అమెరికా నుంచి యూట్యూబ్ ద్వారా సిల్వర్‌ప్లే బటన్ వచ్చింది. లక్ష మంది వ్యవసాయ అభిమానులను సొంతం చేసుకోవడం ద్వారా ఈ అవార్డు వచ్చిందని శివ విలేకరులకు తెలియజేశారు.

వైఎస్‌ఆర్‌టీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడిగా పాష

చారకొండ: వైఎస్‌ఆర్‌టీపీ నాగర్‌కర్నూల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా చారకొండ మండల జూపల్లికి చెందిన కమాల్ పాషను, ప్రచార కార్యదర్శిగా అక్కి సాయిలు గౌడ్‌కు నియామక ఉత్తర్వులను మంగళవారం అందజేశారు. నాయకులు తదితరులు ఉన్నారు.

బీఎల్‌ఓలకు డబ్బులు చెల్లించాలి

కొల్లాపూర్: బీఎల్‌ఓలుగా విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లకు డబ్బులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం బీఎల్‌ఓలతో కలిసి ఆర్డీఓ కార్యాలయంలో ఈ మేరకు వినతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. 2020 సంవత్సరం నుంచి బీఎల్‌ఓలకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. క్రమం తప్పకుండా ఓటర్ల వివరాల నమోదు, మార్పులు, చేర్పులు చేపట్టడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న బీఎల్‌ఓలపై చిన్నచూపు తగదన్నారు. కార్యక్రమంలో పద్మ, ఈశ్వరమ్మ, రేవతి, రజిత, శ్రీశైలమ్మ తదితరులున్నారు.



అన్నదాత ఆగమాగం

కల్వకుర్తి రూరల్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు కళ్లముందే నీటిలో కొట్టుకుపోవడంతో ధాన్యం రైతులు ఆగమాగం అయ్యారు. కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యాన్ని విక్రయించేందుకు తీసుకొచ్చారు. తేమశాతం ఎక్కువగా ఉండటంతో మార్కెట్‌లో వడ్లను ఆరబోశారు. మంగళవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో కురిసిన వర్షానికి ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. వర్షం భారీగా కురవడంతో కప్పి ఉంచిన కవర్ల కింది నుంచి నీరు ప్రవహించడంతో ఆ నీటి వెంట ధాన్యం కొట్టుకుపోయింది. కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ నుంచి శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రోడ్డు వైపు ధాన్యం కొట్టుకుపోయింది. వర్షం నీటికి కళ్ల ముందే ధాన్యం నీటిలో కొట్టుకుపోతుండగా.. బాధను పంటిబిగువన బిగపట్టి మౌనంగా కన్నీరు కార్చారు.

వారం రోజులుగా ఎదురు చూపులు

రైతులు కొనుగోలు కేంద్రానికి వారం రోజుల కిందట ధాన్యాన్ని అమ్మకానికి తీసుకొచ్చారు. తేమ



చెట్ల పొదల్లోకి కొట్టుకుపోయిన ధాన్యం



తడిసిన వరిధాన్యం

శాతం ఎక్కువగా ఉందని చెప్పడంతో కొన్ని రోజులు ధాన్యాన్ని మార్కెట్‌లోనే ఆరబోశారు. నాలుగు రోజుల నుంచి గన్నీ బ్యాగుల కొరత వేధిస్తుండటంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే అకాల వర్షం రైతుల పాలిట శాపంగా మారింది. వర్షానికి ధాన్యం నీటిపాలైంది. దాదాపు 70 మంది రైతులు ధాన్యాన్ని అమ్మకానికి తీసుకొచ్చారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

కల్వకుర్తి: అకాల వర్షానికి నీటిలో ధాన్యం కొట్టుకుపోయిన రైతులకు న్యాయం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మార్కెట్ యార్డులో పర్యటించి ధాన్యం కొట్టుకుపోయిన రైతులను పరామర్శించారు. పదుల సంఖ్యలో రైతులకు సంబంధించిన వరి, మొక్కజొన్న పంటలు నీటిపాలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయకుంటే ఆందోళన చేస్తామని విజయ్‌కుమార్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.



తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న నాయకులు

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయండి



వెల్దండలో సమావేశమైన పత్యానాయక్



లింగాలలో సన్నాహక సమావేశం

వెల్దండ: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేందుకు మండల స్థాయి అధికారులందరూ ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి పత్యానాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి 22 వరకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీఎం కేసీఆర్ ఈ నెల 2న గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళి అర్పించి జెండాను ఆవిష్కరిస్తారని చెప్పారు. 3న రైతువేదికల వద్ద రైతు దినోత్సవాలను నిర్వహించాలన్నారు. 4న సురక్షిత దినోత్సవం, 5న విద్యుత్ దినోత్సవం, 6న సమగ్ర పరిశ్రమ ప్రగతి, 7న సాగునీరు, ప్రాజెక్టుల వద్ద ఉత్సవాలను నిర్వహించాలన్నారు. 8న చెరువుల వద్ద ఆట పాటలు, 22వ తేదీ వరకు ప్రకటించిన సంక్షేమ పథకాలను వివరించి ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఓ మంజుల, ఏపీఎం రాములు, ఏఈ తిరుపతినాయక్ అధికారులు హాజరయ్యారు.

బిజినేపల్లి: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల స్థాయిలో, గ్రామ స్థాయిలో ఘనంగా నిర్వహించాలని తహసీల్దారు సరస్వతీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయా శాఖల అధికారుల ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఆయా శాఖల ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ.. అధికారులు ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ఎంపీడీఓ కరుణశ్రీ, బ్రహ్మచారి పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని మండల కాంప్లెక్స్ మీటింగ్ హాలులో మంగళవారం మండల స్థాయి అధికారులకు ఎంపీడీఓ భాస్కర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాలు ఎలా జరుపుకోవాలి అనేదానిపై సమీక్షించారు.

లింగాల: రాష్ట్ర అవతరణ దినోత్సవం నుంచి 20 రోజుల పాటు నిర్వహించే వేడుకలపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గీతాంజలి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై 20 రోజుల పాటు గ్రామాల్లో వేడుకలు నిర్వహించాల్సి ఉంటుందని ఎంపీడీఓ తెలియజేశారు.

ఊర్కొండ: తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

బడిబాట కార్యక్రమంపై అవగాహన

తాడూరు: జూన్ 3 నుంచి ప్రారంభించనున్న బడిబాట కార్యక్రమంపై మంగళవారం ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో ఐదేళ్లు పైబడిన పిల్లలందరు ఆయా పాఠశాలల్లో నమోదయ్యేలా చూడాలని, ఇక్కడ కూడా బడిబయట విద్యార్థులు లేకుండా, బాలకార్మికులు లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందనే సంగతి మరిచిపోరాదన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వనజ, సీఆర్‌పీ నరేందర్, ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ భాస్కర్‌రెడ్డి

సీఐటీయూతోనే కార్మిక హక్కుల సాధన



తెలకపల్లిలో మాట్లాడుతున్న విజయ్‌గౌడ్

తెలకపల్లి: సీఐటీయూ ద్వారానే కార్మిక హక్కులను సాధించగలుగుతామని సీఐటీయూ సీనియర్ నాయకులు విజయ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల కాంప్లెక్స్ ఎదుట సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండా ఎగురవేసి విజయ్‌గౌడ్ మాట్లాడారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు గోపస్ లక్ష్మణ్, తుమ్మ మహేశ్, లక్ష్మయ్య, గిరిజ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రజా పోరాటాల వారధి, ఐక్య ఉద్యమాల రథసారధి సీఐటీయూ కార్మిక సంఘం అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని బస్టాండ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పర్వతాలు, రామయ్య, అశోక్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సహకారం

కల్వకుర్తి రూరల్: బాధిత కుటుంబాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని లింగసానిపల్లిలో మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని వార్డులను తిరగడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. తర్నికల్‌కి చెందిన యువకులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. వెంకట్‌రెడ్డి, చందు, వినోద్‌రెడ్డి, రాజుగౌడ్ పాల్గొన్నారు.

నాయకుల అరెస్టు

అమ్రాబాద్: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి అచ్చంపేట పర్యటన సందర్భంగా మంగళవారం ఉదయం ఎమ్మార్పీఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. వంకేశ్వరానికి చెందిన నాగిళ్ల నిఖిత మృతి పోస్టుమార్టం రిపోర్ట్ బయటపెట్టాలని అడిగినందుకు పోలీసులు అరెస్టు చేశారని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సోట కాశీం విలేకరులకు తెలియజేశారు.

భారీగా తరలిన బీఆర్‌ఎస్ నాయకులు

చారకొండ: అచ్చంపేట నియోజకవర్గంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుతో వంద పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవం, మంత్రి బహిరంగ సభకు మండలంలోని చారకొండ, సిర్సనగండ్ల, తిమ్మాయిపల్లి, మర్రిపల్లి, తుర్కలపల్లి గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. నిర్మల విజేందర్ గౌడ్, గుర్వయ్య గౌడ్, రవీందర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

కల్వకుర్తి రూరల్: మొక్కల సంరక్షణ సమష్టి బాధ్యత అని జిల్లా అడిషనల్ కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మంగళవారం మండలంలోని సుద్దకల్ నుంచి తర్నికల్ వరకు కల్వకుర్తి నాగర్‌కర్నూల్ రోడ్డుకు ఇరుపక్కల హరితహారంలో నాటిన మొక్కలను పరిశీలించారు. డీఆర్‌డీఓ నర్సింగరావు, ఎంపీడీఓ ఆంజనేయులు, దేవేందర్ ఉన్నారు.

నేడు హతీరాంనాయక్ సంస్మరణ సభ

లింగాల: బంజార సేవా సంఘం నాయకులు, కేతావత్ హతీరాంనాయక్ సంస్మరణ సభను ఈ నెల 31న మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మోతీరాంనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

మండలంలో పాదయాత్ర

లింగాల: కాంగ్రెస్ శాసనసభ పక్షనేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర బుధవారం లింగాల మండలంలోకి ప్రవేశిస్తుందని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

పైపులు దగ్ధం

లింగాల: లింగాల శివారులోని ఓ రైతు పొలంలో రూ.70 వేల విలువ చేసే స్ప్రింక్లర్ పైపులు దగ్ధమయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. రైతు కేతావత్ బాలాజీ వ్యవసాయ పొలం గుడిసెలో పైపులను భద్రపర్చాడు. పొలంలో గుడిసె చుట్టూ ఉన్న ఎండుగడ్డికి ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో, ఆ మంటలు గుడిసెకు తాకి గుడిసెతో పాటు పైపులు దగ్ధమై నష్టం వాటిల్లిందని వాపోయాడు. ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని రైతు కోరాడు.

పశుమిత్రల సమస్యలు పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: పశుమిత్రలతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించుకుంటుందని పశుమిత్రల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ పశుమిత్రల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చైతన్య డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పశుమిత్రలకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వడంతో పాటు రూ.పది లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, అశోక్, శివలీల, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని ఆశ వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి చెన్నమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు వినతి అందజేశారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఆశవర్కర్లకు పరీక్ష పెట్టాలని నిర్ణయించడం సరైంది కాదన్నారు. వరలక్ష్మి, జయమ్మ, పార్వతి, లక్ష్మి పాల్గొన్నారు.

మైనార్టీలపై తీవ్ర వివక్ష

మన్ననూర్: మంత్రి హరీశ్‌రావు పర్యటనపై అధికారులు సమాచారం ఇవ్వలేదని అమ్రాబాద్ మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మైనారీలను తీవ్ర వివక్షకు గురిచేస్తుందని వాపోయారు. ప్రొటోకాల్ పాటించని అధికారులపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

యువకుల సంబరాలు

తెలకపల్లి: ఐపీఎల్‌లో చెన్నయ్ సూపర్‌కింగ్స్ జట్టు విజేతగా నిలిచిన సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో యువకులు సంబరాలు నిర్వహించారు. అయిదో సారి ఐపీఎల్ విజేతగా నిలవడంతో తెలకపల్లి సీఎస్‌కె ధోనీ ఫ్యాన్స్ బాణాసంచా కాల్చి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అర్జున్, శివరాం, అరవింద్, మహేశ్, ఎల్లస్వామి, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

చారకొండ: మండలంలోని గైరాన్ తండాకు చెందిన నేనావత్ బాలరాం నాయక్ సోమవారం రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతను మండలంలోని తిమ్మాయిపల్లిలో విద్యుత్ శాఖలో లైన్‌మైన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విషయం తెలుసుకున్న బీఎస్‌పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు.



నల్లమలను సస్యశ్యామలం చేస్తాం..

మన్ననూర్: సీఎం కేసీఆర్ ఆశీస్సులతో నా సంపూర్ణ సహకారంతో నల్లమల ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం మన్ననూర్‌లో ఎంపీ రాములు, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలతో పాటూ ప్రశాంతి నగర్ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఉమామహేశ్వర, చెన్నకేశవ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనులను త్వరలోనే సీఎం చేతుల మీదుగా ప్రారంభించి కృష్ణా నది జలాలను అమ్రాబాద్ మండలంలోని రైతుల పొలాల్లో పారించి ఏడాదికి రెండు పంటలు పండించుకునే సమయం దగ్గరలోనే ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసే గువ్వల బాలరాజ్ లాంటి వ్యక్తి మీకు ఎమ్మెల్యేగా ఉండటం అదృష్టంగా భావించాలని అన్నారు. మరోసారి బీఆర్ఎస్, గులాబీ జెండాను మీరంతా ఆదరించాలని కోరారు. ఆదివాసి నాయకులు మాజీ సర్పంచ్ నిమ్మల శ్రీనివాసులు, సర్పంచ్ పెద్దిరాజు మంత్రికి పట్టు తేనె, విల్లంబులను బహుకరించారు. జిల్లా పరిషత్ చైర్మన్ శాంతకుమారి, శ్రీరాం, పెద్దిరాజు, శారద, రవీందర్‌రెడ్డి, చెన్నకేశవులు, సత్యనారాయణ, షమీముల్లా, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.



విల్లంబును ఎక్కుపెట్టిన మంత్రి హరీశ్‌రావు

ఐక్యంగా కృషి చేయాలి

దోమలపెంట: బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం పార్టీ నాయకులు ఐక్యంగా కలిసి కృషి చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం ఆయన శ్రీశైలం శైవ క్షేత్రంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దోమలపెంట నాయకులు, శారద, మహేష్, పార్టీ నాయకులు కేపీ.రెడ్డి మంత్రిని కలిసి సత్కరించారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

కల్వకుర్తి: పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఎల్లికట్టకు చెందిన సాత్విక్‌రెడ్డికి రూ.లక్ష, తిమ్మరాసిపల్లికి చెందిన సైదులుకు రూ.3 లక్షలు, యంగంపల్లికి చెందిన శ్రీనివాసులుకు రూ.1.25 లక్షలు, కురుమిద్దెకు చెందిన అంజయ్యకు రూ.28 వేలు, శివకు రూ.18 వేలు, కృష్ణయ్యకు రూ.16 వేలు, రాకేశ్‌కు రూ.32 వేలు, కృష్ణాచారికి రూ.18 వేలు, శేఖరయ్యకు రూ.30 వేలు, జానకమ్మకు రూ.12 వేల చెక్కు పంపిణీ చేశారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

గ్రామదేవతల కటాక్షంతోనే పల్లెలు సుభిక్షం



అవుసలికుంటలో పూజలో పాల్గొన్న గువ్వల



ఉప్పునుంతలలో పూజలు

లింగాల: గ్రామాల్లో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలంటే, వర్షాలు కురువాలంటే గ్రామదేవతలను ఆరాధించడం ఎంతో అవసరమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. మండల పరిధిలోని అవుసలికుంటలో ఈ నెల 25 నుంచి ప్రారంభమైన బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈ నెల 30న మంగళవారం బోనాలతో ముగిశాయి. సర్పంచ్ ఎల్లస్వామి ఆధ్వర్యంలో 6 రోజుల పాటు శక్తిపూజారి బైండ్ల గిరిశక్తి పూజలు జరిపించారు. ముగింపు రోజు ప్రభుత్వ విప్ పాల్గొని గ్రామంలో పునఃప్రతిష్ఠాపించిన బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. జగపతిరావు, రంగినేని శ్రీనివాసరావు, నరేందర్‌రావు, హన్మంత్ రెడ్డి, గ్రామ యువకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనలు

ఉప్పునుంతల: మండల కేంద్రం ఉప్పునుంతలలో మంగళవారం బొడ్రాయి ప్రతిష్ఠాపనలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అనంతరం సాయంత్రం విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. బుధవారం నిత్య పూజలతో పాటు హోమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

కల్వకుర్తి రూరల్: మండలంలోని కురుమిద్దెలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విగ్రహాలను ఊరేగించారు. హోమం నిర్వహించారు. మూడో తేదీ వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఘనంగా విగ్రహాల ఊరేగింపు



పద్మన్నపల్లిలో విగ్రహాలు ఊరేగిస్తున్న భక్తులు



మంచాలకట్టలో ఊరేగింపు

లింగాల: మండల పరిధిలోని పద్మన్నపల్లిలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపాన మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ప్రతిష్ఠించే విగ్రహాలను ప్రత్యేక వాహనంలో ఉంచి భక్తుల కోలాటాలు, భజన కీర్తనల మధ్య ఘనంగా ఊరేగింపు నిర్వహించి జలాధివాసం నిర్వహించారు. ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మంచాలకట్టలో మంగళవారం నుంచి ఆంజనేయస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం గణపతి పూజా, ధ్వజారోహణం, అఖండదీపం, దీక్ష కంకణాధారణ, నవగ్రహ ఆరాధన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. విజయ్‌కుమార్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాగునీటి పేరుతో ప్రజలను మభ్యపెట్టొద్దు

అమ్రాబాద్: పదర, అమ్రాబాద్ మండలాలకు సాగునీరు అందిస్తామని మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఈ ప్రాంత రైతులను మభ్యపెడుతున్నారని బీజేపీ జిల్లా కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు అన్నారు. మంత్రి అచ్చంపేట పర్యటన సందర్భంగా మంగళవారం అమ్రాబాద్ బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి సొంత పూచికత్తుపై విడిచిపెట్టారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. 2018 ఎన్నికల ముందు మంత్రి హరీశ్‌రావు, అమ్రాబాద్ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో సాగునీరు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు చెన్నకేశవ ప్రాజెక్ట్ డీపీఆర్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టయిన వారిలో నాగరాజు, రాజు, శ్రీనివాసులు, వికాస్‌గౌడ్, రాజు తదితరులు ఉన్నారు.



అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

మోకాళ్లపై కూర్చొని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రభుత్వం పెంచిన కొత్త జీతాల అమలుకు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో పెంచిన కొత్త జీతాలను చెల్లిస్తుండగా.. నాగర్‌కర్నూల్ ఆస్పత్రిలో మాత్రం ఇక్కడి కాంట్రాక్టర్లు పాత జీతాలనే చెల్లిస్తూ.. కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఆస్పత్రి వర్కర్స్ నాయకులు అజ్మీర్, గౌరమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు అమలు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కొత్త వేతనాలను తక్షణమే అమలు చేయాలని జీఓ నంబర్ 60ని అమలు చేసి ఆస్పత్రిలో సిబ్బందిని పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది శాంతమ్మ, బాలమణి పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

ఊర్కొండ: దేశంలో ఎన్నో సృజనాత్మకతను తీసుకొచ్చిన ఘనత ఒక్క బీజేపీకే దక్కుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యకృష్ణ, మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీజేపీ నేటితో 9 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. బీజేపీ విశిష్టతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దేశం విలువలు, ప్రతిష్ఠతను కాపాడేది బీజేపీ ఒక్కటే అని అన్నారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్ గౌడ్, నరసింహులు, రాజు, నాగరాజు, ఆంజనేయులు, అశోక్, పరశురాములు పాల్గొన్నారు.